క్లుప్తంగా

బీజేపీ నాయకులపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని బీజేపీ నాయకులపై పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం టౌన్ సీఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నప్పటికీ బీజేపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, ఎండీ జానీ, మొలుగూరి వసంత్, మంద రాజేష్, జువ్వాజి కుమారస్వామి, పొనగంటి శ్రీధర్, సందీప్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

హుజూరాబాద్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హుజూరాబాద్–జమ్మికుంట నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా డాక్టర్ కన్నెబోయిన తిరుపతి, జనరల్ సెక్రటరీగా డాక్టర్ పోతరాజు శ్రీనివాస్, కోశాధికారిగా తొగరు విద్యాసాగర్ ఎన్నికయ్యారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



కవాతు చేస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పురవీధుల గుండా స్వయం సేవకులు కవాతు చేశారు. మహిళలు మంగళహారతులు, పువ్వులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఖండ కార్యవహ దాసరి రవీందర్, ముఖ్య అతిథి డా. ముక్కా రాజేశ్వరయ్య, ప్రధాన వక్త దేవుని మురళి, 200 మంది స్వయం సేవకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

ఇల్లందకుంట: చిన్ననాటి మిత్రుడు అనారోగ్యంతో మృతిచెందగా స్నేహితులంతా ఆర్థికసాయం చేశారు. మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన రామంచ సుక్కయ్య కుటుంబానికి ఇల్లందకుంట హైస్కూల్ 1990–91 పదో తరగతి విద్యార్థులు రూ.పదిహేను వేలు జమ చేసి మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

పశువైద్యశిబిరాలు

రామడుగు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం నిర్వహించనున్నామని మండల పశువైద్యాధికారి మనోహర్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. పశువైద్య శిబిరాలు అక్టోబర్ 15 నుంచి నవంబర్ 14 వరకు నిర్వహిస్తామని పాడిరైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల ప్రచారంలో కేడీఆర్



తిమ్మాపూర్: మండలానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ గెలుపునకు కోసం కష్టపడి పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లో శివరాజ్ అనే వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా కనుక్కొని మంగళవారం అప్పగించినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గత నెలలో శివరాజ్ తన సెల్‌ఫోన్ పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కానిస్టేబుల్ విశ్వతేజ సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేసినట్లు వివరించారు.

లక్షల భవనం.. మూగజీవాలకు నిలయం



నిరుపయోగంగా స్వశక్తి భవనం, బిల్డింగ్ ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు

చిగురుమామిడి: మండల కేంద్రంలో స్వశక్తి భవన నిర్మాణ పనులు పూర్తయిన వినియోగంలో లేదు. ప్రారంభోత్సవం చేసి పదేళ్లు పూర్తయినా వివిధ శాఖలు ఆ భవనంలోకి షిఫ్ట్ కాలేదు. దీంతో భవనం దుమ్ముధూళితో నిండుకుని ఉండటమే గాకుండా భవనం ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. చిగురుమామిడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో భవనం నిర్మాణానికి 2012లో అప్పటి ప్రభుత్వ రూ.25 లక్షలు మంజూరు చేసింది. అప్పటి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పనులు ప్రారంభించగా కాంట్రాక్టర్ 2014లో పూర్తి చేశాడు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మిగులు పనులను పూర్తి చేసేందుకు 2015లో అప్పటి ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ రూ.ఏడు లక్షలు మంజూరు చేశారు. పనులు పూర్తి కాగానే 2016లో అప్పటి ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రారంభోత్సవం చేశారు. భవనానికి కరెంట్ కనెక్షన్ ఇవ్వలేదు, అలాగే నీటి సౌకర్యం కోసం బోర్‌బావి లేదు. దీంతో ఈజీఎస్, ఐకేపీ శాఖలు భవనంలోకి మారలేదు. దాదాపు రూ.32 లక్షలు వెచ్చించిన భవనం ప్రస్తుతం మూగజీవాలకు నిలయంగా మారింది. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో భవనం మూగబోయింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని భవనానికి కరెంట్, నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



రామడుగు: వెదిర గ్రామంలోని వివేకానంద చౌరస్తా నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డును ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మలు కమ్మేస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్డు పక్క నుంచి ఏం వస్తుందో, ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయాందోళన చెందుతున్నారు. గతంలో ఉపాధిహామీ కూలీలతో రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేసి మొక్కలు నాటేవారని, ఈ ఏడాది పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
- సాయికృతి, ఆర్‌అండ్‌బీ ఏఈ సెల్: 9008479686

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాము

గంగాధర: పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించడం వల్లనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో ధమ్మని రాము సూచించారు. అక్టోబర్ 15న గ్లోబల్‌హ్యాండ్ వాష్ డే సందర్భంగా ఐక్యరాజ్యసమితి అనుబంధ విభాగం యునిసెఫ్ (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్) బృందం సభ్యులు స్థానిక అధికారులతో కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. గర్శకుర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తినడానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభమై పదకొండేళ్లు పూర్తయిన సందర్భంగా స్వచ్ఛ భారత్‌కు ముందు స్వచ్ఛ భారత్‌కు తర్వాత జరిగిన మార్పులను, అమలు తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, పరిసరాలశుభ్రత, తడి, పొడిచెత్త వేరు చేసే విధానంపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యునిసెఫ్ మూడు రాష్ట్రాల ఇంచార్జి వెంకటేశ్, తెలంగాణ ఇంచార్జి ఫణికుమార్, జిల్లా ఎస్‌బీఎం కోఆర్డినేటర్లు రమేశ్, వేణు, మండల పంచాయతీ అధికారి గౌరి రమేశ్, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, బీర్ల రాజు, వీవోలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వరుణ



మానకొండూర్‌లో...

సీపీఆర్‌పై అవగాహన

జమ్మికుంట: మండలంలోని వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ వరుణ మంగళవారం సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వావిలాల రైతు వేదికలో (కార్డియో పల్మొనరీ రిసస్టిటేషన్) అత్యవసర పరిస్థితుల్లో వ్యక్తి ప్రాణాలు ఏలా కాపాడగలం అనే విషయాన్ని గ్రహిస్తే రక్షించే వీలు ఉంటుందన్నారు. గుండె మెల్లగా కొట్టుకోవడం, అకస్మాత్తుగా సంభవించే సంఘటనల్లో సీపీఆర్ చేయాలన్నారు. జమ్మికుంట మండల పరిధిలోని ఉద్యోగులు, ఐసీడీఎస్, యువకులు, కార్యదర్శులు, వివిధ విభాగాల సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, ఏఈవో అర్చన, హెల్త్ సూపర్‌వైజర్ సదానందం, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, ఏఎన్‌ఎం, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని ఉద్యోగులకు వైద్యసిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీవో వరలక్ష్మి మాట్లాడుతూ.. అనుకోని పరిస్థితుల్లో గుండె, ఊపిరితిత్తులు ఆగిపోయినప్పుడు సీపీఆర్ చేస్తే వ్యక్తి ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు సల్మాన్, సీహెచ్‌ఓ రాజునాయక్, సిబ్బంది జుబేర్, హాజీబాబ, ఎల్‌టీ మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీల్లో సిల్వర్ మెడల్



ప్రహర్షికను అభినందిస్తున్న ప్రిన్సిపల్ పద్మశ్రీ

మానకొండూర్: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని గోలేటి టౌన్‌షిప్‌లో అక్టోబర్ 10 నుంచి 12వ తేదీల్లో సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రహర్షిక పోటీల్లో పాల్గొని సబ్ జూనియర్ బాలికల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. ఈసందర్భంగా ప్రిన్సిపల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పీఈటీ ఉయ్యాల విష్ణువర్ధన్ విద్యార్థినిని అభినందించారు.

వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి



అభినందిస్తున్న ఏసీపీ, మున్సిపల్ కమిషనర్

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మంగళవారం పోషన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో శస్త్ర పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఐదో తరగతి విద్యార్థిని బావు సుదీక్ష ప్రథమ బహుమతి సాధించింది. ఏసీపీ మాధవి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, స్కూల్ కరస్పాండెంట్ వేణుమాధవ్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

దొనపాటి శ్రీకాంత్‌రెడ్డికి డాక్టరేట్

రామడుగు: మండలంలోని రంగసాయిపల్లి గ్రామానికి చెందిన దొనపాటి శ్రీకాంత్‌రెడ్డి డీమ్డ్ టు బీ యూనివర్సిటీ (చైతన్య) హైదరాబాద్ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. కృత్రిమ మేధస్సు, యాంత్రిక అభ్యాసనంపై డాక్టర్ జి. మాధవి మార్గదర్శకత్వంలో పరిశోధన చేసి కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ పొందారు. శ్రీకాంత్‌రెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

చిగురుమామిడి ఎంపీడీవో సస్పెన్షన్

చిగురుమామిడి: చిగురుమామిడి ఎంపీడీవో బి. మధుసూదన్‌పై ఎట్టకేలకు కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. గత శుక్రవారం జెడ్పీ సీఈవో శ్రీనివాస్ పంచాయతీ వార్డుల రిజర్వేషన్లలో జరిగిన అవకతవకలపై షోకాజ్ నోటీసు జారీ చేశారు. చిగురుమామిడి మూడో వార్డు, రేకొండలోని 14వ వార్డు రిజర్వేషన్‌పై అవకతవకలు జరిగాయని, తక్షణమే సవరించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించినా మధుసూదన్ పట్టించుకోలేదు. ఆగ్రహించిన కలెక్టర్ పమేలా సత్పతి ఎంపీడీవోను సస్పెన్షన్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేశారు. విషయాన్ని అధికారులు ధ్రువీకరించారు.

అధికారుల తప్పు.. అవ్వ తిప్పలు



ప్రజావాణిలో డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రాజమ్మ (ఫైల్)

జమ్మికుంట: అధికారుల చేసిన పొరపాటుకు ఓ అవ్వ నెలల తరబడి రెవెన్యూ, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతోంది. పట్టాదారు పేరు తప్పుగా రాయడంతో రైతుబంధు అందడం లేదనిని ఆ వృద్ధ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది. మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన పూల్లూరి రాజమ్మకు 30 గుంటల భూమికి సంబంధించి రైతుబంధు రావడం లేదని వ్యవసాయ అధికారులను కలిసింది. రెవెన్యూ అధికారులు రికార్డుల్లో రాజమ్మకు బదులుగా వజ్రమ్మ అని పేరు తప్పుగా రాశారు. రైతుబంధు కోసం 2025 జూన్ 30న మీ సేవా ద్వారా పేరు మార్పిడికి భూ భారతిలో సవరణ కోసం దరఖాస్తు చేసుకుంది. రెవెన్యూ అధికారులే పేరు తప్పుగా మార్చారని, పేరు సవరణ చేయకుండా నెలల తరబడి తిప్పుతున్నారని, న్యాయం చేయాలని వేడుకుంటోంది. ఇటీవల ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేసినట్టు బాధితురాలు తెలిపింది.





దుమ్ముతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, వన్‌వే కారణంగా వాహనాల రద్దీ

ఇటు దుమ్ము.. అటు వన్‌వే

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామ శివారులో దుమ్ముధూళితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండడమే కాకుండా వన్‌వేతో ట్రాఫిక్‌తో తిప్పలు పడుతున్నామని వాపోతున్నారు. తాడికల్, మొలంగూర్ క్రాస్ వద్ద జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఫ్లై ఓవర్ నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో వన్‌వేలో వాహనాలు వెళ్తున్నాయి. ఏదైనా వాహనం చెడిపోతే వాహనాలు నిలిచిపోతున్నాయి. దుమ్ముధూళితో వాహనదారులు ఊపిరాడక అల్లాడుతున్నారు. కాంట్రాక్టర్ నీరు చల్లించడం లేదని, సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

యువకుడి మృతిపై విచారణ



విచారణ చేస్తున్న సీఐ సదన్‌కుమార్

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామశివారులోని శాతవాహన బ్రీడింగ్ హెచరీస్ ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీలో పశ్చిమబెంగాల్‌కు చెందిన యువకుడు దాసో సోరెన్ మృతిపై తిమ్మాపూర్ సీఐ జి. సదన్‌కుమార్ విచారణ చేపట్టారు. మంగళవారం చిగురుమామిడి ఇంచార్జి ఎస్సై స్వాతితో కలిసి ఫ్యాక్టరీ నిర్మాణ పనుల కోసం వచ్చిన తోటి కూలీలను విచారించారు. ముస్లింఖాన్ డబ్బుల విషయంపై సోరెన్‌తో ఎందుకు గొడవ పడాల్సి వచ్చిందని, పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఎవరి డబ్బులు వారికి ఇవ్వలేదా, ఇస్తే వీరిద్దరి మధ్య గొడవ ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ ఓనర్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే ఇలాంటి సంఘటనలే జరుగుతాయని, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

జీతం.. జీవన పోరాటం

- ప్రభుత్వాస్పత్రి ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి అందని వేతనాలు
- పూర్తయిన అగ్రిమెంట్.. ఏడు నెలలుగా తప్పని ఎదురుచూపులు



ప్రభుత్వ ప్రధానాసుపత్రి

కరీంనగర్‌టౌన్: 'పని చేశామంటే... జీతం వస్తుంది కదా అని ఆశించాం. ఇప్పుడు పని చేసినందుకే బతకలేని పరిస్థితి దాకా వచ్చాం'. అని కన్నీటితో చెబుతున్నారు కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బంది. 2023లో మెడికల్ కళాశాల ఏర్పాటుతో జిల్లా ఆసుపత్రి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిగా అభివృద్ధి చెందినా వేతనాల విషయంలో పాత బాధే వినిపిస్తోంది. వైద్య విధాన పరిషత్ నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆధీనంలోకి మారిన తర్వాత కూడా పరిస్థితులు మారడం లేదని చెబుతున్నారు.

ఏడు నెలలుగా జీవన పోరాటమే

ఆస్పత్రిలో 28 మందికిపైగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వీరిలో స్టాఫ్‌నర్సులు, ల్యాబ్, ఎక్స్‌రే, వెంటిలేటర్ టెక్నీషియన్లు, సెక్యూరిటీ సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ అసిస్టెంట్లు, ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలున్నారు. వీరికి ఏడు నెలల నుంచి అగ్రిమెంట్ పూర్తయినా జీతాలు అందడం లేదు. వాస్తవానికి వారందరూ హాస్పిటల్‌లో 24గంటల సేవలో నిమగ్నమై ఉంటారు. వారికే వేతనాలు జాప్యం చేస్తుండడంతో ఇదేం విధానమని ప్రశ్నిస్తున్నారు. ఇళ్ల గడిచేందుకు ఒక్క రూపాయి ఆదాయం లేక అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. మరికొంత మంది నెలల తరబడి బంధువుల సాయంతో బతుకుబండిని లాగుతున్నామని చెబుతున్నారు.

నిర్లక్ష్యం ఎందుకు?

ఇప్పటి వరకు సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, త్వరలోనే వస్తాయనే జవాబే వస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న సిబ్బందికే వేతనాల భరోసా లేకపోతే, ప్రజలకు ఎలాంటి సంక్షేమం అందుతుందని ప్రశ్నిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

కొమురయ్యకు సన్మానం



కరీంనగర్‌టౌన్: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నికైన సొగాని కొమురయ్యయాదవ్‌ను కరీంనగర్ జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం వివేకానంద విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో అఖిల భారత యాదవ మహాసభ సీనియర్ నాయకులు పాల్గొని మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం ప్రైవేట్ విద్యా సంస్థలను ఏర్పాటుచేసి ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థాయికి చేర్చిన ఘనత కొమరయ్య సార్‌కు దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ, బూస అంజన్న, కన్నెబోయిన ఓదెలు, చేర్ల పద్మ, గీతాంజలి, భాష బోయిన మల్లేశం, కటికన బుచ్చన్న, కాల్వ మల్లేశ్, కొండా రవి, జంగ కొమురయ్య, తిరుపతి, దాడి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలి



కరీంనగర్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులందరికీ తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ కరీంనగర్‌అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో బి. సబితాకుమారి అన్నారు. పోషణమాసంలో భాగంగా చామనపల్లిలో మంగళవారం నిర్వహించిన దుర్శేడ్ సెక్టార్ స్థాయి పోషకాహార సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోషణమాసంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రతిరోజూ నిర్ణీత పరిమాణంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన స్టాళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. ఇద్దరు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆహారం–ఆరోగ్యంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, మెడికల్ ఆఫీసర్ శోభ, అంగన్‌వాడీ టీచర్లు మణెమ్మ, గీత, పద్మ, నీల తదితరులు పాల్గొన్నారు.

జీపీవోల సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న జీపీవోలు

కరీంనగర్ అర్బన్: జీపీవోల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్‌కు మంగళవారం గ్రామ పాలనాధికారులు వినతిపత్రం అందజేశారు. నెలవారీ ఖర్చులు, కుటుంబ అవసరాలు, ఈఎంఐలు, తదితర వాటిని తీర్చేందుకు ఇబ్బంది పడుతున్నామని వివరించారు. క్యాడర్ స్ట్రెంత్ మంజూరు చేసి వేతనాలిచ్చేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. వీఆర్ఏ నుంచి పదోన్నతి పొంది రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరించి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని అన్నారు. గ్రామ పాలనాధికారుల సంఘం జిల్లా నాయకులు ఆంజనేయప్రసాద్, ఊట్ల కృష్ణ, రేవంత్‌కుమార్, రవీందర్, నలువాల సాయికిశోర్, హరీశ్, రమేశ్, శ్రీనివాస్, వెంకటస్వామి, సురేశ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కరీంనగర్ అర్బన్: గ్రూప్–1 ఫలితాల్లో జిల్లా రిజిస్ట్రార్‌గా ఎంపికైన శుగుప్తా ఫిర్దోస్‌ను మంగళవారం యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ సంఘం నాయకులు సన్మానించారు.